# కార్పొరేట్ షాక్

పాలపర్తి జ్యోతిష్మతి

ఆ వాతావరణం చూస్తుంటే సుబ్బలక్ష్మికి ఏదో వింత ప్రపంచంలోకి వచ్చినట్లుంది. అది హాస్పిటల్‌లా లేదు. బస్‌స్టాండ్‌లాగా, రైల్వేస్టేషన్‌లాగా కిటకిట లాడుతోంది. అక్కడి జనాల్ని చూస్తుంటే సరదాగా కాలం గడపడానికి పిక్నిక్‌స్పాట్‌కి వచ్చినట్లుంది. విచిత్రంగా అంతా గమనిస్తూ మౌనంగా కూర్చుంది. తమకు ఇచ్చిన గదిలోకి వెళ్ళగానే "నువ్వేం కంగారు పడకక్కా! ఏం కావాలన్నా రూమ్‌కి తెచ్చిస్తారు. మందులూ వగైరా అన్నీ వాళ్ళే చూసుకుంటారు. ప్రతిరోజూ సాయంత్రం నేనూ నాన్నా వచ్చి వెళ్తాం" అన్నాడు తమ్ముడు ప్రసాదు.

ఇంతలో ఒక డాక్టరు తలుపు తోసుకుని లోపలికి వచ్చాడు. పేషంట్‌బెడ్ మీద కూర్చున్న సావిత్రమ్మతో "రేపొద్దున్న ఆపరేషన్. ఏం టెన్షన్ పడకండి. రిలాక్స్‌డ్‌గా ఉండండి" అని చెప్పి, "అటెండెంట్ ఎవరు?" అని అడిగాడు.

"నేనే" అంది సుబ్బలక్ష్మి.

డాక్టరు సుబ్బలక్ష్మి చేతికి రెండు మాత్రలు ఇచ్చి "రాత్రి పడుకునే ముందు వెయ్యండి. ఇది జలుబు, దగ్గులాంటి అనారోగ్యాలు రాకుండా, ఇది టు కీప్ హర్ క్వైట్" అని చెప్పి బయటికి నడిచాడు.

"ఏంటమ్మా! 'టు కీప్ యు క్వైట్' ఈ మాత్ర వెయ్యమంటున్నాడు. అల్లరి బాగా చేస్తున్నావా?" అంది సుబ్బలక్ష్మి. అందరూ గట్టిగా నవ్వారు. డాక్టరు గబగబా లోపలికొచ్చి "ఏంటండీ, ఆవిడ్ని ప్రశాంతంగా ఉండనివ్వరా?" అన్నాడు కోపంగా.

"ఆవిడ కూడా నవ్వుతోంది కదండీ? ఆపరేషన్‌కి ముందు పేషెంట్ అంత హుషారుగా ఉంటే మీరేంటి చిరాకు పడతారు?" ఎదురు ప్రశ్నించింది సుబ్బలక్ష్మి.

డాక్టరు వెళ్ళిపోగానే "నువ్వు జోక్స్ వేస్తే ఎంజాయ్ చేసే మూడ్‌లో ఉండరు ఇక్కడివాళ్ళు. అంతా హడావుడి, కంగారూనూ." అన్నాడు ప్రసాదు.

"జాగ్రత్తమ్మా!" అన్నాడు సుబ్బలక్ష్మి తండ్రి వెంకట్రామయ్య.

"చంటిపిల్లాడితో మా ఆవిడ హాస్పిటల్‌లో ఉండడం కుదరదని నిన్ను పిలిపించాల్సొచ్చింది అక్కా! అక్కడ బావగారికీ, చింటూకీ కూడా ఇబ్బంది. నీకు కష్టంగా అనిపిస్తే మధ్యలో ఎప్పుడైనా ఒకరోజు తను వచ్చి ఉంటుంది, నువ్వు ఇంట్లో రెస్టు తీసుకోవచ్చు" అన్నాడు ప్రసాదు.

"అదేంటిరా అట్లా అంటావు? అమ్మకి గుండె ఆపరేషన్ చేయిస్తుంటే దగ్గర ఉండడం నేను కష్టం అనుకుంటానా? ఏం ఫరవాలేదు. సమ్ హౌ ఐ కెన్ మేనేజ్" తండ్రికీ తమ్ముడికీ కలిపి సమాధానం చెప్పింది సుబ్బలక్ష్మి.

గార్డు వచ్చి "ఇంతమంది ఉండకూడదు. పేషెంటు దగ్గర ఒక్కరే ఉండాలి" అని చెప్పడంతో సుబ్బలక్ష్మినీ, సావిత్రమ్మనూ రూమ్‌లో వదిలి వెంకట్రామయ్యా, ప్రసాదూ వెళ్ళిపోయారు.

ప్రతిరోజూ సాయంత్రం విజిటింగ్ అవర్స్‌లో ప్రసాదు, వెంకట్రామయ్య వచ్చి టైం అయిపోయేదాకా కూర్చుని వెళుతున్నారు.

"అదేంటిరా ఆ డాక్టరు? రాగానే అమ్మని 'నమస్కారమండీ' అని పలకరిస్తాడు, మనం ఆయనకి నమస్కారం పెట్టాల్సింది పోయి. "మొదటిరోజు ఆశ్చర్యంగా ప్రసాదుని అడిగింది సుబ్బలక్ష్మి.

"అదంతా కార్పొరేట్ కల్చర్ అక్కా! ఈ హాస్పిటల్సూ, ఆపరేషన్సూ అంతా వ్యాపారమే. మరి వ్యాపారంలో కస్టమర్స్‌తో గౌరవంగా వ్యవహరిస్తేనే కదా అభివృద్ధి చెందేది! అయినా ఈ కార్పొరేట్ హాస్పిటల్స్‌లో పనిచేసే వాళ్ళంతా 'అయాం డాక్టర్ సో అండ్ సో' అని చెప్పుకుంటారు. వాళ్ళంతా నిజంగా డాక్టర్లు కాదు" వివరించాడు ప్రసాదు.

"ప్రతిరోజూ అంత దూరం నుంచి శ్రమపడి నువ్వు రాకపోతే ఏం నాన్నా? ఇరవైనాలుగ్గంటలూ నేను అమ్మ దగ్గరే ఉంటున్నాను కదా?" అంది సుబ్బలక్ష్మి ఒకరోజు తండ్రితో.

మీ అమ్మ ఇంత పెద్ద ఆపరేషన్ చేయించుకుని పడుకుని ఉంటే చూడాలనిపించకుండా ఉంటుందామ్మా?" అన్నాడు వెంకట్రామయ్య బాధగా.

"ఏమిటో వీళ్ళ రూల్సు. పేషంటు దగ్గర ఒకరి కంటే ఎక్కువ మందిని ఉండనివ్వరు. లేకపోతే నువ్వు కూడా కళ్ళ ఎదురుగా అమ్మని చూసుకుంటూ ఇక్కడే ఉండొచ్చు" అంది సుబ్బలక్ష్మి.

"నాకు మాత్రం ఎంతసేపూ ఇంటి దగ్గర ఏం తోస్తుందమ్మా? ఏదో ఇట్లా వచ్చి వెళ్తే కాసేపు కాలక్షేపం అవుతుంది."

"నీ వయసూ, ఆరోగ్యం కూడా చూసుకోవాలిగా నాన్నా?"

ప్రేమగా కూతురి తలమీద చెయ్యి వేశాడు వెంకట్రామయ్య

అట్లా అట్లా కాలం గడిచిపోయి డిశ్చార్జ్ రోజు వచ్చింది.

ఒక నర్స్ వచ్చి సుబ్బలక్ష్మి చేతిలో ఒక కాయితం పెట్టి "పూర్తి చేసి ఇవ్వండి" అంది.

"ఏంటిది?" అడిగింది సుబ్బలక్ష్మి.

"ఫీడ్‌బ్యాక్ ఫాం. ఏదోఒకటి, టిక్కులు పెట్టి ఇచ్చెయ్యండి" అని వెళ్ళిపోయింది నర్స్.

అంతలో ఇంకో అమ్మాయి వచ్చి "అయాం డాక్టర్ సునీత, డైటీషియన్" అని పరిచయం చేసుకుని, సావిత్రమ్మ వైపు చెయ్యి చూపిస్తూ "డయాబెటిక్ కదా?" అని అడిగింది సుబ్బలక్ష్మిని.

"అవును" చెప్పింది సుబ్బలక్ష్మి.

"డైట్ ఛార్ట్ ప్రిపేర్ చేసి తెచ్చిస్తాను, దాన్ని ఫాలో అవండి" అని చెప్పి వెళ్ళిపోయింది.

"వచ్చినప్పట్నించీ చూస్తున్నాను ఈ హాస్పిటల్‌లో పద్ధతులు. మమ్మల్ని విసిగించడమే ఏకైక లక్ష్యంగా ఉంది. పొద్దున్నే ఐదున్నరనుంచి మొదలుపెడతారు. ఒక నర్స్ వచ్చి 'సుగర్ టెస్టు చెయ్యాలి' అంటుంది. కసుక్కు కసుక్కున సూదులు పొడిచీపొడిచీ వేళ్ళు తూట్లు పడిపోయాయి. రోజుకి నాలుగుసార్లా సుగర్ చేసేది? పట్టుమని అరగంట విశ్రాంతిగా ఉండనివ్వరు. ఆరింటికల్లా గది తుడవడానికి వస్తుంది ఒకావిడ. చీపురు నాలుగుసార్లు ఆడించి, తడిగుడ్డతో పులిమేసి వెళ్ళిపోతుంది. వరసగా డాక్టర్లు వస్తూ ఉంటారు. అంతమంది డాక్టర్లు చూడాలా? ఎంత ఎక్కువమంది డాక్టర్లు చూస్తే అంత మంచి హాస్పిటల్ అని లెక్క కాబోలు. ఒకళ్ళొచ్చి 'మందులు సరిగ్గా వేసుకుంటున్నారా?' అని అడుగుతారు. ఇంకొకళ్ళొచ్చి 'అన్ని వసతులూ బాగున్నాయా?' అని అడుగుతారు. ఇదేమైనా హొటల్ రూమా? మధ్యలో 'సూప్' అంటూ ఆ దిక్కుమాలిన రసమేదో తెచ్చి మొహాన కొట్టి పోతారు.

"వీళ్ళ శుభ్రం తగలబడ! భోజనంచేసి కాసేపు నడుంవాల్చుదా మనుకునే లోపే మూడింటికల్లా 'క్లీనింగ్' అంటూ మళ్ళీ తయారు. రాత్రి పదిన్నరకి ఒక డాక్టరు వచ్చి 'బీపీ తగ్గిందా? సుగర్ కంట్రోలయిందా?' అని అడుగుతాడు. అయినా ఆవిషయం డాక్టరు చెప్పాలా? పేషెంటు చెప్పాలా?

"నాన్నకి కాలు విరిగినప్పుడు కట్టు విప్పాక పాలేరు వెంకన్న నెమ్మదిగా లేపి నడిపించాడు. ఇప్పుడు నాన్న ఏ ఇబ్బందీ లేకుండా నుబ్బరంగా నడుస్తున్నాడు. ఇక్కడ నడిపించడానికి ఒక డాక్టరు. 'అయాం డాక్టర్ శిరీష, ఫిజియోథెరపిస్ట్' అంటూ హైహీల్సు టక్కుటక్కు లాడించుకుంటూ వచ్చింది. అయినా బైపాస్ సర్జరీ అయిన పేషంట్‌ని లేపి నడిపించడానికి ఫిజియోథెరపిస్ట్ రావాలా? వీళ్ళందర్నీ పోషించడానికి మా దగ్గర లక్షలులక్షలు గుంజుతారు.

"ఫీడ్‌బ్యాక్ ఫామట. 'ఈ హాస్పిటల్ చాలా చాలా బాగుంది' అని రాసివ్వాలి కాబోలు. చెత్తగా ఉందని రాస్తాను. తిక్క కుదిరిపోతుంది.

"మాకున్న రోగానికి ఏం తిండి తినాలో, ఎట్లా జాగ్రత్త పడాలో మాకు తెలీదు! డైట్‌షీట్ ఇస్తుందట, డైట్‌షీట్. క్షేమంగా ఇక్కణ్ణించీ బయటపడితే చాలని ఇప్పటిదాకా మాట్లాడకుండా ఊరుకున్నాను. ఇంక వెళ్ళిపోబోతుండగా ఇప్పుడు నువ్వు నాకు దొరికిపోయావు. రా, తీసుకురా! ఇవాళ నా చేతిలో నీ పని అయిపోయింది."

"ఏమిటే, నీలో నువ్వు మాట్లాడుకుంటున్నావు?" అడిగింది సావిత్రమ్మ.

"ఆఁ...! ఇంకో రెండు రోజులు ఇక్కడే ఉంటే నాకు పిచ్చెక్కుతుంది. అందుకని ఇప్పట్నించే ప్రాక్టీసు చేస్తున్నాను."

"రెండు రోజులెందుకు? ఇప్పుడే పిచ్చి మాటలు మాట్లాడుతున్నావు." సణుక్కుంటూ కళ్ళు మూసుకుంది సావిత్రమ్మ.

డాక్టర్ సునీత వచ్చి ఒక కాయితం సుబ్బలక్ష్మి చేతిలో పెట్టి "చూసి డౌట్లేమైనా ఉంటే అడగండి" అంది.

సుబ్బలక్ష్మి కాయితం మొత్తం చదివి తలెత్తి చూసింది.

"చెప్పండి" అంది డాక్టర్ సునీత.

"వంచదార, బెల్లం, స్వీట్సు తినకూడదని రాశాను. సుగరున్నవాళ్లు అవి తినకూడదని తెలియని వాళ్ళెవరైనా ఉంటారా? ఇది ఇక్కడ రాయడం అవసరమా?"

"అది మా ఫార్మాలిటీ. పద్ధతి ప్రకారం అవన్నీ రాస్తాం."

"కాఫీ, టీ, పాలు ఒక కప్పు అని రాశారు. కప్పు అంటే ఎంత కప్పు?"

డాక్టర్ సునీత మొహంలో ప్రశ్నార్థకం.

"ఆహా! అంటే... మా అబ్బాయి బళ్ళో పరుగు పందెంలో ఫస్టొస్తే 'బూస్ట్ ఈస్ ద సీక్రెట్ ఆఫ్ మై ఎనర్జీ' అంటూ ఈ కప్పు నిండా తాగు' అని చెప్పి ఇదుగో... ఇంత పెద్దకప్పు బహుమతిగా ఇచ్చారు.

"మా వీధిలో తెలిసినవాళ్ళున్నారు. వాళ్ళింటికెళ్తే... వాళ్ళు చాలా పిసినారి వాళ్ళులే! ఇంత బుల్లి కప్పులో కాఫీ ఇస్తారు.

"ఒక కప్పు అని ఇక్కడ రాసినప్పుడు ఏ సైజు కప్పో తెలియాలి కదా? అంతకంటే ఈ కాయితంతో పాటూ కప్పుకూడా మీరే ఇస్తే బాగుంటుంది కదా! మీరెటూ ఏదీ ఊరికే ఇవ్వరు. ఆ కప్పుల మీద కూడా లాభాలొస్తాయి."

సుబ్బలక్ష్మి మాట్లాడేది డాక్టర్ సునీతకి మింగుడు పడట్లేదు. మిడి గుడ్లేసుకుని చూస్తూ నిలబడిపోయింది.

"తరువాత... పొద్దున్న రెండు పుల్కాలు కానీ, మూడు ఇడ్లీలు కానీ తినమని రాశారు. ఊరికే పుల్కాలు, ఇడ్లీలు అని రాస్తే మాకెట్లా తెలుస్తుంది? విస్తళ్ళంత పుల్కాలు చెయ్యొచ్చు, రూపాయి బిళ్ళంత ఇడ్లీలు చెయ్యొచ్చు. ఒక్కొక్కళ్ళ అలవాటు ఒక్కో రకంగా ఉంటుంది. అందుకని వాట్ల వ్యాసమో, వ్యాసార్థమో 'ఇంత ఉండాలి' అని సూచిస్తే మాకు తేలిగ్గా ఉంటుంది."


డాక్టర్ సునీత ఏం మాట్లాడాలో తెలీక గుటకలు మింగుతోంది.

"అవన్నీ సరిచేసి రాసి తెచ్చివ్వమ్మా!" అని కాయితం సునీత చేతిలో పెట్టింది సుబ్బలక్ష్మి.

ఆయా వచ్చి సావిత్రమ్మని వీల్‌ఛైర్‌లో కూర్చోపెట్టి 'వెళ్దామా?' అన్నట్టు సుబ్బలక్ష్మివైపు చూసింది.

"ఆఁ...! ఇదేదో ఫీడ్‌బ్యాక్ ఫామటమ్మా! ఇచ్చారు. నాకు ఇంగ్లీషు రాదు. కాస్త ఇది కూడా నువ్వే పూర్తిచేసి వాళ్ళకిచ్చెయ్యి" అంటూ ఆ కాయితం కూడా సునీత చేతిలో పెట్టి ఆయా వెనకే బయటికి నడిచింది సుబ్బలక్ష్మి.

రెండు చేతుల్లో ఉన్న రెండు కాయితాల్నీ మార్చిమార్చి చూసింది డాక్టర్ సునీత. 'ఇంగ్లీషులో ఉన్న డైట్‌షీట్ చదివి తనని ఎడాపెడా వాయించేసి, ఇంగ్లీషు రాదంటూ ఫీడ్‌బ్యాక్ ఫాం పూర్తిచెయ్యకుండా ఇచ్చేసిందేమిటి?" అన్న ఆలోచన రావడంతో గబగబా బయటికి వచ్చి సుబ్బలక్ష్మిని కేకేసి పిలిచేంతలో సుబ్బలక్ష్మినీ, సావిత్రమ్మనూ తనలో పొదువుకుని మెత్తగా కిందకి జారిపోయింది లిఫ్టు.



కవి భగ్వాన్‌ని సన్మానిస్తున్న కొత్తపేట (తూ॥గో॥జిల్లా) ప్రియదర్శిని బాలవిహార్ ప్రిన్సిపాల్ బుద్ధచంద్రదేవ్. నల్లం సత్యనారాయణమూర్తి, కవి జి.సుబ్బారావు, హరిహరదేవళరాజు (ఎడమ నుంచి కుడికి)